



WWW.VIJAYAKERATAM.COM
RNI: APTEL/2010/34724

# విజయ కెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




సెప్టెంబర్ 8 మంగళవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 216 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

TUESDAY SEPTEMBER 8 2026 | VOL:18 | ISSUE: 216 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. కేసీఆర్ క్షమాపణ చెప్పాలని అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్

### తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం

### ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి ఛైర్మన్ ను కోరిన వైనం

### స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య

### బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి.. సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇది స్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని, సభలోని ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానమని అన్నారు. బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో సంయమనం పాటిస్తుందని, దాన్ని తమ చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో సభలను చూశానని, చట్టసభల్లో ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్ అన్నారు. ఇలాంటి వైఖరిని క్షమిస్తూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న గౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు. మరోవైపు బీజేపీపైనా సీఎం విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో నిర్ణయం తీసుకున్న తర్వాతే బీజేపీ లేవనెత్తిన అంశాలపై చర్చిస్తామని రేవంత్ స్పష్టం చేశారు.

## అసెంబ్లీలో రచ్చ.. బీజేపీకి అన్నింట్లో రాజకీయాలే కావాలంటూ కోమటిరెడ్డి ధ్వజం

### 22-ఏపై చర్చకు బీజేసీప సభ్యుల పట్టు

### భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు

### బీఆర్ఎస్ తో బీజేపీ కుమ్మక్కయిందన్న కోమటిరెడ్డి

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన వెంటనే సభలో బీజేపీ సభ్యుల గందరగోళంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించగానే, బీజేపీ ఎమ్మెల్యేలు 22-ఏ నిషిద్ధ భూముల అంశంపై తక్షణమే చర్చ చేపట్టాలని పట్టుబడుతూ ప్లకార్డులతో సభాప్రాంగణంలోకి దూసు కెళ్లారు. స్పీకర్ కల్పించుకుని...



(మిగతా 2వ పేజీలో..)

## మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం: హరీశ్ రావు

### బీఆర్ఎస్ సభ్యులు సభలోకి రాకుండా అడ్డుకోవాలనే కుట్రతో రేవంత్ ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు

### శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్య

### శాసనసభ కౌరవసభలా మారిందని విమర్శ



తెలంగాణ శాసనసభ సమావేశాల

(మిగతా 2వ పేజీలో..)

## అసెంబ్లీలో ఊహించని పరిణామం.. కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్

### అసెంబ్లీలో కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్

### తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ

### తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్

### వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి

### స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన

తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభాపతికి జరిగిన అవమానం

(మిగతా 2వ పేజీలో..)



## ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?: కేటీఆర్

### శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్

### తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి

### ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ

ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే

(మిగతా 2వ పేజీలో..)



## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

### అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ

### సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం

### నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్

(మిగతా 2వ పేజీలో..)






విజయకేరటం
తెలుగు దినపత్రిక

# అసెంబ్లీలో ఊహించని పరిణామం.. కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్

మొదటి పేజీ తరువాయి)

సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

## సంపాదకీయం

### ఓటు హక్కు హరణం... ఎన్నికల సంఘం బాధ్యత ఎక్కడ?

భారత ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం ఒక అవకాశం కాదు. అది రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కు. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునే ఏకైక మార్గం. అయితే ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునఃపరిశీలన (సర్) ప్రక్రియ ఈ హక్కును హరించేలా మారిందన్న ఆందోళన ప్రజల్లో ఉంది. ఈ ప్రక్రియలో ఎన్నికల సంఘం నిర్లక్ష్యం చేస్తోందనే ఆరోపణ కూడా ఉంది. చిన్న చిన్న అనుమానాలతో అర్హులను ఓటు హక్కు నుంచి దూరం చేయడం ప్రాథమిక హక్కును హరించడమే అవుతుంది. 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించిన ఈ ప్రక్రియలో సుమారు 36 కోట్ల ఓటర్లు ఉన్న జాబితా నుంచి దాదాపు 6 కోట్ల మంది పేర్లను తొలగించారు. ఢిల్లీలో ప్రతి ముగ్గురు ఓటర్లలో ఒకరిని అనర్హులుగా ప్రకటించారు. మహారాష్ట్రలో 2 కోట్లకు పైగా, కర్ణాటకలో 1.07 కోట్లు, తెలంగాణలో 73 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 44 లక్షలు, జార్ఖండ్‌లో 43 లక్షల పేర్లు తొలగుంచబడ్డాయి. పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు దాదాపు 90 లక్షల పేర్లు తొలగించిన విషయం తెలిసిందే. ఈ తొలగింపులన్నీ సరైన ధ్రువీకరణ లేకుండా, తగిన అవకాశం ఇవ్వకుండా జరిగాయన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఎన్నికలు జరగక ముందే ట్రిబ్యునళ్ల ముందు వాదన వినిపించే అవకాశం చాలా మందికి దక్కలేదు. పశ్చిమ బెంగాల్‌లో అప్పీలు చేసిన 82,782 మందిలో 75,443 మందికి (91 శాతం) తిరిగి ఓటు హక్కు కల్పించిన విషయాన్ని బట్టి ఈ ప్రక్రియలో ఎంత అన్యాయం జరిగిందో స్పష్టమౌతుంది. అంటే ఎన్నికల సమయానికి అనర్హులుగా ప్రకటించిన వారిలో అత్యధికులు అర్హులే అని తేలింది. ఓటర్ల జాబితా సవరణ అవసరమే. డూప్లికేట్ పేర్లు, చనిపోయినవారు, వేరే చోటికి మారినవారు ఉండకూడదు. కానీ ఆ ప్రక్రియను నిర్వహించే విధానం ప్రశ్నార్థకంగా మారింది. భారం ఓటర్లపై పడుతోంది. తమ పేరు జాబితాలో ఉండాలంటే తామే అర్హతను నిరూపించుకోవాలని చెప్పడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. జాబితాను తయారు చేసేది ఎన్నికల సంఘమే కాబట్టి, తొలగించే ముందు తగిన ఆధారాలు చూపించాల్సిన బాధ్యత కూడా దానిదే. ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఓటరు జాబితా నుంచి పేరు తొలగించడం కేవలం ఓటు హక్కుకే పరిమితం కావడం లేదు. రేషన్ కార్డు, పాస్‌పోర్ట్, ప్రభుత్వ పథకాలు వంటి ఇతర హక్కులు, సేవలు కూడా ప్రభావితమవుతున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓటర్ల జాబితాను పౌరసత్వంతో ముడిపెట్టడం మరింత ప్రమాదకరం. పౌరసత్వం ఎన్నికల సంఘం పరిధిలోని అంశం కాదు. ఓటరు లిస్టులో స్పెల్లింగ్ మిస్టేక్ ఉందని లేదా సపోర్ట్ డాక్యుమెంట్ల లో పేరు తప్పుగా ఉందనే సాకుతో నోటీసులిస్తున్నారు. చిన్న పాటి అక్షరదోషాన్ని కూడా ఎత్తి చూపి..ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఎక్కడ తమ పేరు ఓటరు లిస్టులోంచి తొలగించబడుతుందోనని భయపడిపోతున్నారు జనం.రాజ్యాంగం తమకు కల్పించిన హక్కును పొందేందుకు సామాన్యులు నానా అవస్తలు పడుతుంటే.. ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను తన విజయంగా ప్రచారం చేస్తోంది. న్యాయవ్యవస్థ కూడా ఈ విషయంలో తగినంతగా జోక్యం చేసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఓటు హక్కు పిల్లల ఆట కాదు. దానిని తేలికగా చూడలేం. రాజ్యాంగం ప్రకారం ప్రజలే రాజకీయ అధికారానికి మూలం. అర్హులైన పౌరులు ఓటు వేయలేని పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య ప్రాతినిధ్యమే దెబ్బతింటుంది. ఎన్నికల సంఘం తన పద్ధతులను సమీక్షించుకోవాలి. అవసరమైతే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాల్సిన అవసరం ఉంది.

సమీ, సీనియర్ జర్నలిస్ట్.

## మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి)

వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు."కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు.మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం.. డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్!

- డీఎంకే ప్రభుత్వంపై సీఎం విజయ్ తీవ్ర అవినీతి ఆరోపణలు
- అసెంబ్లీ సాక్షిగా పాత ఫైళ్లను, కమిషన్ల వివరాలను ప్రస్తావించిన సీఎం
- స్టాలిన్, ఉదయనిధి, సెంథిల్ బాలాజీ పేర్లను పేర్కొంటూ విమర్శలు
- మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రజల తీర్పును గౌరవించకపోవడంతోనే డీఎంకే ప్రతిపక్షంలో ఉందని వ్యాఖ్య



తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, డీఎంకే పాలనలో జరిగిన అవినీతిని, అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. రాజకీయ విమర్శలు సహజమేనని, కానీ మహిళలపై అనుచితమైన, కించపరిచే వ్యాఖ్యలు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సభలో స్పష్టం చేశారు. డీఎంకేకు ఓటు వేయని ప్రజలను ఆ పార్టీ నేతలు విమర్శించడంపై ఆయన మండిపడ్డారు. ప్రజల తీర్పును గౌరవించకపోవడం వల్లే డీఎంకే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు. అవినీతి ఆరోపణల గురించి ప్రస్తావిస్తూ, డీఎంకే బండారం మొత్తం అధికారిక రికార్డుల్లో, అసెంబ్లీ లైబ్రరీలో అందుబాటులో ఉందని విజయ్ అన్నారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను ఆయన ఉటంకించారు. వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్టులు ఇచ్చేందుకు కమీషన్లు డిమాండ్ చేశారని, ఒక నిర్దిష్ట కంపెనీకి అనుకూలంగా వ్యవహరించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతేగాక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపణలను కూడా విజయ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ ఫండ్ల పేరుతో పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేశారని, కొన్ని లావాదేవీలలో 7.5 నుంచి 10 శాతం వరకు కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి వి. సెంథిల్ బాలాజీ తన అధికారిక హోదాను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ఈ అక్రమ లావాదేవీలలో మాజీ మంత్రికి సంబంధించిన అధికారులు, వ్యక్తులు భాగస్వాములుగా ఉన్నారని విజయ్ తెలిపారు. ఈడీ ఆరోపణలకు సంబంధించి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ పేర్లను కూడా ఆయన ప్రస్తావించారు. అయితే, ఇవి కేవలం ఏజెన్సీ చేసిన ఆరోపణలు మాత్రమేనని, కోర్టులో ఇంకా రుజువు కాలేదని గమనించాలి. డీఎంకే అవినీతికి సంబంధించిన రికార్డులు చాలా ఉన్నాయని, అవన్నీ చదవాలంటే దాదాపు రెండు రోజులు పడుతుందని, అందుకే సభలో కేవలం సారాంశాన్ని మాత్రమే ప్రస్తావిస్తున్నానని విజయ్ చెప్పారు. ఇప్పటికే బహిరంగ రికార్డుల్లో ఉన్న ఆధారాల కోసం డిమాండ్ చేయడం మాని, తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డీఎంకేకు సవాల్ విసిరారు. తాను పదవి కోసమో, అధికారం కోసమో రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని స్పష్టం చేశారు. సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, ఎన్టీ రామారావు వంటి మహనీయుల వారసత్వాన్ని గుర్తుచేస్తూ, రాజకీయ ప్రత్యర్థులపై ప్రజల అభిమానమే అంతిమంగా గెలుస్తుందని విజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో రాజకీయ వేడి.. హౌస్ అరెస్టులపై బీజేపీ ఆగ్రహం

తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అసెంబ్లీ ముట్టడికి బీజేపీ పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమై పలువురు కీలక నేతలను గృహనిర్బంధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల అరెస్టులతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 22ఏ జాబితా నుంచి ప్రైవేటు భూములను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఈ ఆందోళనకు పిలుపునిచ్చింది. 'ఫీజు బకాయి–బీజేపీ లడాయి'లో భాగంగా 'చలో ఇందిరాపార్క్' కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చారు. అయితే, ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. అనుమతి లేనప్పటికీ అసెంబ్లీ ముట్టడికి బీజేపీ శ్రేణులు సిద్ధమవడంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌తో పాటు ఖమ్మం తదితర జిల్లాల్లో బీజేపీ, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అసెంబ్లీ పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. అసెంబ్లీ సమావేశాల వేళ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సభ లోపల, వెలుపల ఎండగడతామని బీజేపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. శాంతియుత నిరసనలను కూడా ప్రభుత్వం అణచివేస్తోందని, ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని వారు ఆరోపిస్తున్నారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

మొదటి పేజీ తరువాయి)

ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

## ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

## అసెంబ్లీలో రచ్చ.. బీజేపీకి అన్నింట్లో రాజకీయాలే కావాలంటూ కోమటిరెడ్డి ధ్వజం

మొదటి పేజీ తరువాయి)

బీఏసీ సమావేశంలో చర్చించి 22–ఏపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయినప్పటికీ బీజేపీ సభ్యులు తగ్గలేదు. భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ బీజేపీ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు.మరోవైపు, బీజేపీ సభ్యుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సభలో ఏ అంశంపైనైనా సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే, బీజేపీ నాయకులకు మాత్రం అన్నింట్లో రాజకీయాలే కావాలి" అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. లక్ష కోట్ల మేర భారీ అవినీతి జరిగిందని, దానిపై సీబీఐ విచారణ జరిపించాలని ఏడాది క్రితం లేఖ రాసినా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్‌తో లోపాయికారీగా కుమ్మక్కై విచారణ జరగకుండా బీజేపీ అడ్డుపడుతోందని సంచలన ఆరోపణలు చేశారు. కాళేశ్వరం అవినీతి బయటకు రాకుండా స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలే అడ్డుపడుతున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు. మరో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... సభకు బీజేపీ సభ్యులు సహకరించాలని విన్నవించారు. ప్రొసీజర్ ప్రకారం సభ నడవాలని అన్నారు. 22–ఏపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

## ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు.. ప్లకార్డులు తెస్తే సహించేది లేదని స్పీకర్ వార్నింగ్

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు వాడీవేడి వాతావరణం నడుమ ప్రారంభమయ్యాయి. సభ ఆరంభంలో జాతీయ గేయం 'వందేమాతరం' పూర్తి 6 చరణాలను సభ్యులందరూ భక్తిశ్రద్ధలతో ఆలపించారు. అనంతరం స్పీకర్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ సభా ప్రాంగణంలోకి ఎవరూ ప్లకార్డులు, నిరసన పత్రాలు తీసుకురావడానికి వీల్లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపక్ష సభ్యులు ఎవరైనా ప్లకార్డులు తెస్తే, వాటిని వెంటనే మార్షల్స్‌కు అప్పగించాలని సూచించారు. సభ సమగ్రతను, మర్యాదను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న సెక్షన్ 22–ఏ నిషిద్ధ భూముల వ్యవహారంపై సభలో చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో స్పీకర్ కీలక ప్రకటన చేశారు. శాసనసభా వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశంలో చర్చించిన తర్వాతే 22–ఏ అంశంపై సభలో ఏ విధంగా చర్చ చేపట్టాలనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. నియమావళికి లోబడి ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనే సంకేతాలు ఇస్తూనే... సభాకార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పీకర్ స్పష్టం చేశారు.



# స్వచ్ఛ వాయు సర్వేక్షణలో నల్గొండకు జాతీయ స్థాయి గుర్తింపు.

**ఎన్ సి ఏ పి వార్డు స్థాయి స్వచ్ఛ వాయు సర్వేక్షణ--2026లో కేటగిరీ--3లో 2వ ర్యాంక్.**

**అవార్డుతో పాటు రూ.20 లక్షల నగదు బహుమతి**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . సెప్టెంబర్ 7. విజయ కెరటం .**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక గుర్తింపు సాధించింది. కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ లో భాగంగా నిర్వహించిన వార్డు స్థాయి స్వచ్ఛ వాయు సర్వేక్షణ--2026 లో దేశవ్యాప్తంగా 130 పట్టణ స్థానిక సంస్థలు పాల్గొనగా, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ నంబర్--16 కేటగిరీ--3లో జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా రూ.20 లక్షల నగదు బహుమతితో కూడిన అవార్డును నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి. వంశీకృష్ణ, వార్డు నంబర్--16 కార్పొరేటర్ పెరిక స్వాతి స్వీకరించారు. సెప్టెంబర్ 7న న్యూఢిల్లీలోని ఇందిరా పర్యావరణ భవన్‌లో గంగా ఆడిటోరియంలో జరిగిన స్వచ్ఛ వాయు దివస్--2026 కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ, ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ చైర్‌పర్సన్ రాజేష్ వర్మ, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ అండ్ స్పెషల్ సెక్రటరీ సుశీల్ కుమార్ అవస్థి, అదనపు కార్యదర్శి ఆశుతోష్ అగ్నిహోత్రి, అదనపు కార్యదర్శి మరియు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్‌పర్సన్ డా. అమందీప్ తదితరులు హాజరయ్యారు. ఎన్సిఏపి లో భాగంగా నిర్వహించిన సర్వేక్షణలో గాలి నాణ్యత మెరుగుదల, రహదారి దుమ్ము నియంత్రణ, ఘన వ్యర్థాల నిర్వహణ, పచ్చదనం పెంపు, ప్రజల్లో అవగాహన వంటి అంశాలపై పట్టణ స్థాయిలో చేపట్టిన చర్యలను పరిగణనలోకి తీసుకున్నారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జంక్షన్ల అభివృద్ధి, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, బ్లాక్ ప్లాంటేషన్, ట్రాఫిక్ కారిడార్లలో పచ్చదనం పెంపు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల రూపాంతరం, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ వంటి చర్యలను చేపట్టింది. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ "ఈ జాతీయ స్థాయి అవార్డు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు గర్వకారణం. నల్గొండ ఎమ్మెల్యే,రోడ్లు--భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహాయ సహకారాలతో నల్గొండ నగర అభివృద్ధికి మరింత వేగం తీసుకువచ్చి, అన్ని డివిజన్లలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక పట్టణ సౌకర్యాలు కల్పిస్తూ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను తెలంగాణ రాష్ట్రంలోనే నంబర్--1 కార్పొరేషన్‌గా




తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం" అని మేయర్ తెలిపారు. కమిషనర్ బి. వంశీకృష్ణ మాట్లాడుతూ "మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారం, మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మార్గదర్శకత్వంలో నల్గొండ నగరానికి మరింత మెరుగైన పట్టణ మౌలిక వసతులు, ఆధునిక పౌర సౌకర్యాలు, పరిశుభ్రమైన పరిసరాలు, పచ్చదనం, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను అందించే దిశగా చర్యలు కొనసాగిస్తాం. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నల్గొండ నిర్మాణానికి మరింత సమన్వయంతో పనిచేస్తాం" అని కమిషనర్ తెలిపారు. కేటగిరీ--3లో జాతీయ స్థాయిలో సాధించిన 2వ ర్యాంక్‌తో పాటు రూ.20 లక్షల నగదు బహుమతితో లభించిన ఈ అవార్డు నల్గొండ నగర అభివృద్ధి ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు.



# ప్రజావాణిలో జిల్లా అధికారులతో కలిసి ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్






**నల్లగొండ సెప్టెంబర్ 7 విజయ కెరటం ప్రతినిధి**

మండల ప్రత్యేక అధికారులు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతివారం మండలంలో సమీక్షించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు .ఆ నివేదిక ఆధారంగా ప్రతి శుక్రవారం సమీక్షించడం జరుగుతుందని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం. జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు . ఈ సోమవారం సుమారు( 88) మంది దరఖాస్తుదారులు వారి సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు, అధికారులకు విజ్ఞాపనలు అందజేశారు. ఈ దరఖాస్తులలో వ్యక్తిగత సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అంతేకాక ఉద్యోగ, ఉపాధి, తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఫిర్యాదులను స్వీకరించిన తర్వాత జిల్లా కలెక్టర్ ఎప్పటిలాగే జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) లో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్లకు సంబంధించి నిర్వహిస్తున్న విచారణ పురోగతిని పెంచాలన్నారు. జారీచేసిన ప్రతి నోటీసును ఏ ఈ ఆర్ ఓ లు విచారణ నిర్వహించాలని, ఓటరు సమర్పించిన ధృవపత్రాలను పరిశీలించి విచారణ అనంతరం బిఎల్ఓ ,సూపర్వైజర్ల ద్వారా అప్లోడ్ చేయించాలని చెప్పారు. వి బి జి రాంజీ కింద నీటినిలువ కట్టడాలు, సోక్ పిట్లు, పర్కులేషన్ ట్యాంకులు మంజూరు చేయడం జరిగిందని, వాటన్నిటి పై సమీక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరునాటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులను పూర్తి చేయాలని, ఈ విషయంలో నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమం వేగవంతం చేసి పూర్తి చేయాలని చెప్పారు .గుడిసెల్లో నివసించే వారికి సంబంధించిన వివరాలు రెండు నియోజకవర్గాలకు సంబంధించి పూర్తిగా వచ్చాయని, తక్కిన నియోజకవర్గాల వివరాలు కూడా పంపించాలని అన్నారు. ప్రజావాణి దరఖాస్తులను అన్ని స్థాయిలలో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ,ప్రతి సోమవారం జిల్లా ,మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి ఫిర్యాదులతో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. చేయూత పెన్షన్లకు సంబంధించి పరిశీలన వివరాలను సమర్పించాలన్నారు. టి బి ముక్త్ భారత్ అభియాన్ కింద జిల్లాలో టీబిని నిర్మూలించడంలో భాగంగా తక్షణమే జిల్లా, మండల స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ ను ఆదేశించారు. టీబిని నివారించేందుకు తీసుకునే చర్యలపై ప్రతి మండలంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, జిల్లాలో ఈ సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు 1368 మంది టీబి వ్యాధిగ్రస్తులను గుర్తించడం జరిగిందని, టీబిని పూర్తిగా తగ్గించడంలో భాగంగా తీసుకోబోయే చర్యలపై ముందుగా ప్రాథమిక స్థాయి సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి మండలంలో నలుగురు లేదా ఐదు మందితో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. పౌష్టికాహార లోపం కారణంగా టీబి వచ్చేందుకు అవకాశం ఉందని, అందువల్ల ప్రభుత్వం తరపున టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు .టీబి వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీలు ప్రజల్లో అవగాహన కల్పించాలని ,టిబి నిర్మూలనలో భాగంగా ముందుగా టీబి వచ్చేందుకు అవకాశం ఉన్న వారిని గుర్తించి పరీక్షలు నిర్వహించడం, టీబి సోకిన వారికి నిరంతర చికిత్స చేయడం, చనిపోయే వారి శాతం తగ్గించడం, అలాగే టీబి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం చేయాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, జిల్లా అధికారులు ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు.

## పోలీస్ గ్రీవెన్స్ లో బాధిత ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**నల్లగొండ సెప్టెంబర్ 7 విజయ కెరటం ప్రతినిధి**

సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గారు జిల్లాలో వివిద పోలీస్ స్టేషన్ పరిదిలో నుంచి వచ్చిన దాదాపు 38 మంది బాధితులసమస్యలను, ఫిర్యాదులను సవివరంగా విని సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ గారు, సంబంధిత పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో మాట్లాడి బాధితుల ఫిర్యాదుల విషయంలో ఎలాంటి జాప్యం చేయకుండా, వాస్తవాలను పూర్తిస్థాయిలో విచారించి అవసరమైన చోట కేసులు నమోదు చేయడం, దర్యాప్తు చేపట్టడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారంపై స్పష్టమైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి తీసుకువచ్చినప్పుడు వాటిని బాధ్యతాయుతంగా స్వీకరించి, బాధితులకు అండగా నిలవాలని జిల్లా ఎస్పీ గారు అధికారులకు సూచించారు.



## నూతన ఇండియన్ పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న తండు సైదులు గౌడ్

**విజయ కెరటం ప్రతినిధి : నల్గొండ నియోజకవర్గం:**



కనగల్ మండల కేంద్రంలో కనగల్ మండలం మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ పెట్రోల్ పంపు ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దీ=ా రాష్ట్ర నాయకులు, మాజీ జడ్పీటీసీ, చంద్రం ఫౌండేషన్ చైర్మన్ డా. తండు సైదులు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ యజమాని నర్సింగ్ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ పెట్రోల్ బంక్ అభివృద్ధి చెందాలని, వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించాలని డా. తండు సైదులు గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయితగోని జనార్ధన్ గౌడ్ చింతల విజయ్ కుమార్ గౌడ్ శేఖర్ వెంకటేశ్వర్లు రవి నాగరాజు రవీందర్ ప్రసాద్ కిషోర్ మహిళలు స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17న ఉద్యమకారుల ఓదార్పు యాత్ర

- **పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక**

**వరంగల్,విజయ కెరటం సెప్టెంబర్ 07:**



సెప్టెంబర్ 17న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో ఆవిష్కరించారు. ఉద్యమకారుల ఐక్యతే లక్ష్యంగా.. ఓదార్పు యాత్రను విజయవంతం చేయాలి. సెప్టెంబర్ 17న జరిగే యాత్రలో ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రాష్ట్ర కన్వీనర్ వొడపల్లి శ్యాం కృష్ణ పిలుపు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ వొడపల్లి శ్యాం కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి చాంద్ పాషా, బొల్లిశెట్టి అశోక్, ఎర్రం మనోహర్‌రావు, చెన్నూరి నటరాజ్, రాంపల్లి శ్రీనివాసచారి, మొలంగూరు నెల్సన్, ఇమ్మడిశెట్టి రాజు, మేకల కృష్ణ, తొలిదశ ఉద్యమకారులు దాసరి జనార్ధన్, కొండేటి నారాయణరెడ్డి, ఉద్యమకారులు లింగంపల్లి నూతన ప్రసాద్, గుంపుల మాలతీలత, దేవుని రాజు, బంక కుమారస్వామి, ఆకుల వెంకటేశ్వర్లు, ఎండి ఖాదర్, ఇప్ప రాములు, గద్దల జనార్ధన్, గద్దల కుమారస్వామి, ఆవుల నవీన్‌కుమార్ తదితర తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్




**నల్లగొండ సెప్టెంబర్ 7 విజయ కెరటం ప్రతినిధి**

ఎస్ఐఆర్--2026 ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల అధికారి పి. సుదర్శన్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్--2026 ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని జిల్లా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో నోటీసులు జారీ చేసిన కేసుల తదనంతర ప్రక్రియ కొనసాగుతోందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేస్తామని చెప్పారు. డాక్యుమెంటేషన్ పరిశీలన,విచారణ ప్రక్రియ కొనసాగుతోందని, డాక్యుమెంట్లు లేని కేసులకు అవసరమైన పత్రాలను త్వరగా సేకరించి ప్రక్రియ పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఫామ్--7, ఫామ్--8లను సిద్ధంగా ఉంచుకోవాలని బీఎల్ఓలను ఆదేశించడమే కాకుండా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై వివరించామని సీఈఓ కి తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు నోటీసులు జారీచేసిన ఓటర్లు సమర్పించిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత సమయంలోపు పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,జిల్లారెవెన్యూ అధికారి దశరథ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు .



విజయ కెరటం
తెలుగు దినపత్రిక

# రాఘవేంద్ర మీనాక్షి హోటల్ నూతన బ్రాంచ్ ప్రారంభం

- వినియోగదారులకు నాణ్యతతో ఆహార సేవలు అందించాలి: డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు యాదవ్



**వరంగల్ విజయ కెరటం , సెప్టెంబర్ 07:**

వినియోగదారులకు నాణ్యతతో ఆహార సేవలు అందిస్తూ మరింత అభివృద్ధి చెందాలని : డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. సోమవారం చంద్రాయణగుట్ట--బండ్లగూడ సమీపంలో శ్రీ రాఘవేంద్ర మీనాక్షి హోటల్ నూతన బ్రాంచ్‌ను తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ కమిషన్ మెంబర్ డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు యాదవ్, యాదాద్రి బోర్డు కమిటీ మెంబర్ పోచబోయిన ఈశ్వరమ్మ ప్రారంభించారు.తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు హోటల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ, శ్రీ రాఘవేంద్ర మీనాక్షి గ్రూప్ హోటల్స్ హైదరాబాద్‌లో నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందిస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నాయని అన్నారు. పరిశుభ్రత, నాణ్యత విషయంలో యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ భవిష్యత్తులో మరిన్ని బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. హోటల్ యాజమాన్యానికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త హరిహర రెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల లలిత యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడికి శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగయ్య యాదవ్, కిషోర్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సింహ యాదవ్, తెలంగాణ యువత అధ్యక్షులు ఇమ్మడి సతీష్, తెలంగాణ రాష్ట్ర సోలార్ డైరెక్టర్ రమేష్, సినీ డైరెక్టర్ వినయ్ కుమార్, రాజేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నాని 'ది ప్యారడైజ్' విడుదల వాయిదా? సెప్టెంబర్ 24పై అనుమానాలు!

**నాని 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ సందిగ్ధత**

**సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1కి మారే అవకాశం**

**క్లైమాక్స్ సీజీ పనుల్లో జాప్యమే కారణమంటున్న ట్రేడ్ వర్గాలు**

**మరోసారి వాయిదా పడితే డిస్ట్రిబ్యూటర్లపై ప్రభావం**

**నిర్మాతల నుంచి ఇంకా వెలువడని అధికారిక ప్రకటన**

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం.ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, 'ది ప్యారడైజ్' నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో 'ది ప్యారడైజ్' కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ రెండో వారంలో విజయ్ దేవరకొండ 'రణబాలి', సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' వంటి పెద్ద సినిమాలు కూడా రానుండటంతో పోటీ మరింత తీవ్రంగా ఉండనుంది.ఇప్పటికే 'ప్యారడైజ్' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. తొలుత మార్చి 26, ఆ తర్వాత ఆగస్టు 21 తేదీలను ప్రకటించి, చివరకు సెప్టెంబర్ 24ను ఖరారు చేశారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడితే ఇది మూడోసారి అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, ఈ వాయిదా వార్తలపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతానికి సెప్టెంబర్ 24నే అధికారిక విడుదల తేదీగా ఉంది. త్వరలోనే నాని చిత్రబృందంతో సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. రాబోయే కొద్ది రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.






# నా కెరీర్ నాశనం చేసినవారి పతనం చూస్తా: బాలీవుడ్ నటి తనూశ్రీ దత్తా

బాలీవుడ్ నటి, మాజీ మిస్ ఇండియా యూనివర్స్ తనూశ్రీ దత్తా సోషల్ మీడియాలో మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన జీవితంలో కష్టాలకు, కెరీర్‌లో ఎదుగుదలకు అడ్డుపడిన వారికి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు. కర్మ సిద్ధాంతాన్ని ప్రస్తావిస్తూ, తనకు అన్యాయం చేసిన వారు తప్పకుండా పర్యవసానాలు ఎదుర్కొంటారని, వారి పతనాన్ని తాను కళ్లారా చూస్తానని పేర్కొన్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఏముందంటే..**

"నన్ను నా సహజ మార్గం నుంచి పక్కకు తప్పించి, బాధపెట్టిన వారికి చెబుతున్నా. నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలు మళ్లీ అద్భుతంగా పుంజుకుంటాయి. నా తప్పు లేకుండా నన్ను బాధించిన ప్రతి ఒక్కరి పతనాన్ని నేను చూస్తాను" అని తనూశ్రీ రాసుకొచ్చారు. "కర్మ చక్రాలు తిరుగుతున్నాయి. రాబోయే కాలం నాది. నాపై కుట్రలు పన్ని, నన్ను మానసికంగా హింసించి, నాపై నిఘా పెట్టి దాడి చేసిన ఆ దుర్మార్గులు భయంకరమైన శక్తుల చేతిలో చిక్కి శాశ్వతంగా వేధింపులకు గురవుతారు. వాళ్లు చేసిన పాపాలకు వాళ్లే పశ్చాత్తాపపడతారు. వాళ్ల జీవితాలు వాళ్ల కళ్ల ముందే నాశనమవుతాయి" అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించారు.

**గతంలోనూ ఆరోపణలు**

గత నెలలో కూడా తనూశ్రీ తన కెరీర్‌ను కొందరు ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. "శత్రు శిబిరానికి చెందిన కొందరు వ్యక్తులు" తనకు పని అవకాశాలు రాకుండా అడ్డుకుంటున్నారని, తనకు మంచి ప్రాజెక్టులు, బ్రాండ్‌ల నుంచి ఆఫర్లు వచ్చినా వాటిని తప్పుదారి పట్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.2018లో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన చమీమశీ ఉద్యమంలో తనూశ్రీ దత్తా కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 2008లో 'హార్న్ ఓకే ప్లీజ్' సినిమా చిత్రీకరణ సమయంలో సీనియర్ నటుడు నానా పటేకర్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆమె బహిరంగంగా ఆరోపణలు చేశారు. అప్పటి నుంచి, ఇండస్ట్రీలో తనకు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఆమె పలు సందర్భాల్లో గళం విప్పుతూనే ఉన్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528